



'మీరు వెయ్యి చెప్పండి — లక్ష చెప్పండి — ఈ డబ్బులో ఒక్క పైసా ముట్టుకుందుకి వీల్లేదు. ముందునుండీ నేను చూస్తూనే వున్నాను. ఎప్పుడూ అది లేదని—ఇదిలేదని, మందులకని, స్కూలు జీతాలకని — ఏదో ఒక సాకుతో వందలకి వందలు ముట్టచెప్తూనే వున్నారు. నేను ముచ్చటపడి నెక్లెస్ చేయించుకుందామని వుంచుకున్న ఈ డబ్బు ... ఏమైనా సరే... నేనివ్వను. మీరేమనుకున్నా సరే...'

'అదికాదు లక్ష్మీ! ఇప్పటి అవసరం ఎలాంటిదో నువ్వు ఆలోచించకపోతే ఎలా చెప్పు? అంత దూరంనుండి నాన్న వచ్చారంటే సరదాకి కాదుకదా! లేదంటే పాపం—ఆయన చాలా చిన్నబుచ్చుకుంటారు. నా మాట విను. ఆ డబ్బు...'

'...ఇవ్వనంటే ఇవ్వను. మీ కష్టసుఖాల్లో, మంచిచెడ్డల్లో పాలు పంచుకుని, జీవితాన్ని మీకై అంకితం చేసుకున్న నేనెంత చిన్నబుచ్చుకుంటానో మీరూ ఆలోచించాలి. అంత బాధ్యత అని బాధపడకపోతే, ఎక్కడో అప్పచేసి ఇచ్చిపంపరాదూ? నన్నుమాత్రం మరి విసిగించకండి—'

ఆరాత్రి పదిగంటలవేళ, తాను నిద్ర పోతున్నాడని అనుకున్న ఆ నిమిషాల్లో, కొడుకూ కోడళ్ల సంభాషణ మరి నిలవ నియ్యలేదు రాఘవయ్యగారిని.

కొండంత ఆశతో, కనీసం ఓ వెయ్యి రూపాయలైనా సర్దుతాడని, మిగతాది అక్కడా ఇక్కడా తెచ్చి, ఒక్కగానొక్క కూతురు సరోజ పెళ్ళి చేసెయ్యాలని ఆశించిన తనకు ఎదురైందేవిటి?

'మరి విసిగించకండి' అని పెళ్లాం అనగానే, కిక్కురుమనకుండా, ఆ రాత్రి రామం పూరుకుంటాడని, తనని వుత్తిచేతుల్తో పంపించేస్తాడని, కలలోకూడా అనుకోలేదు.

ఏమైతేనేం, రిక్తహస్తాలతోనే తాను రైలెక్కేయాల్సి వచ్చింది.

'అయితే ఎలారా రామం ఈ పెళ్లి జరిగేది? సరోజ పెళ్లి మరి చెయ్యలేమని, చేతగాని తండ్రికి కూతురుగా పుట్టిన నేరానికి ఇలా బతుకంతా మొండిగానే బతికేయమని, ఇంకా తెగిస్తే...తెగిస్తే... నువ్వే మొగుణ్ణి వెతుక్కోమని—చెప్పెయ్యమంటావా? ఏం చేద్దామంటావ్ రా?' అని వెళ్లేముందు అడిగిన దానికి, కోడలు ఇచ్చిన సమాధానం మహా షోగ్గా వుంది. ఔన్మరి. కొడుకు చేతగాని చవట అయినప్పుడు, కోడలైనా ఏదో సలహా ఇవ్వాలిగా మరి!

'ఎందుకు మామగారూ అంత నిష్ఠూరంగా మాట్లాడతారు? అవసరాలకు ఎప్పుడు మేం ఆదుకోలేదు? చేతిలోవుంటే ఇవ్వకపోవడానికి మేం రాళ్లూ రాపాషాణాలూ కాంగా! ఈ మహా వట్నంలో, మండిపోతున్న ధరలతో — మేం ఎలా గడుపుకొస్తున్నామో ఎవరికీ అక్కర్లేదు. అయినా సరోజకేం తక్కువ? ఈ రోజుల్లో ఆడపిల్లలేం చేస్తున్నారు? తను పెళ్లికి తానే ఏ ఉద్యోగమో చేసుకుని, వెనకేసు

కుని, శుభ్రంగా ఓ ఇంటివాళ్లౌతున్నారు. ఆ ఉద్యోగంలో వున్నప్పుడే, సరోజ ఎలాగూ ఉందమైంది కాబట్టి, ఎవరో ఒకరు ప్రేమించకపోరు. అప్పుడు మరి...'

మరి వినలేక — ఆడదై వుండి, బాధ్యత గల ఇంటి కోడలై వుండి, సొంత ఆడబిడ్డ పెళ్లి గురించి లక్ష్మి ఇచ్చిన సలహా — మరి వినలేక, భోజనమైనా చెయ్యకుండా, ఆ ఇంటి గుమ్మం దాటేశాడు తను.

'కాస్త జరగవమ్మా — మరీ అంత కాళ్లు జాపుకుని పడుకుంటే, ఇవతల వాళ్లకి కనీసం కూర్చుందుకేనా జాగా వుండాలా? ఇళ్లల్లోలాగ మరీ అంత సుఖం కావలిస్తే ఎలా?—' అంటూ ఎదురు బెర్తుమీద పడుకున్న ఆవిడ కాళ్లు బలవంతానెట్టి, ఎవరో కాస్త బలంగావున్న ఆమె జబర్దస్తీగా జాగా సంపాయించుకుంది.

'ఎవరమ్మా నువ్వు? ఇలా పడుకున్న వాళ్లని లేపడం ఘోరమైన పాపమని తెలీదూ? నీకు పంచమహా పాతకాలూ చుట్టుకోక పోతాయా? యములాళ్లు నిన్ను గొరగొరా ఈడ్చుకు పోకపోతారా?' అంటూ పురాణం శాస్త్రులుగారి సహధర్మచారిణి సోమిదేవమ్మగారు ఛర్రున లేచారు.

ఈ గొడవతో, తన ఆలోచనలు చెదిరిపోగా, నిద్రరాని కళ్లు తెరిచి, చుట్టూ చూసి, సర్దుకుని కూచున్నారు రాఘవయ్యగారు.

పంచమహా పాతకాలూ చుట్టుకుంటాయని శపించిన సోమిదేవమ్మగారు, ముందు రైలెక్కినప్పుడు, ఇలాగే పడుకున్న మరో ప్రయాణీకురాలిని లేపి, గలగలా పురాణం చదివేసి, తాను జాగా సంపాయించుకున్నదన్న సంగతి, తనకు జాగా దొరికిన మరుక్షణమే మరిచిపోయింది పాపం!

ఇలాంటివి తలుచుకుంటే ఎంత ఆశ్చర్యమేస్తుందో?

లక్ష్మిని తనఇంటి కోడలు చేసుకోమని, ఆమె తండ్రి తనని బతిమాలిన తీరు, ఆఖరికి — స్వయంగా లక్ష్మే — కాబోయే అత్తవారిల్లనే సిగ్గైనా లేకుండా తన ఇంటికి వచ్చి పార్వతితో—

'అత్తగారూ... మా పరిస్థితులు మీకు తెలియనివికావు. మా నాన్న సంపాదన ఎంతో మేం దాచినా, తెలీనివారు లేరు. నేనుగాక ఇంకా మరో ఇద్దరు ఆడపెల్లలున్నారు పెళ్లికి. కట్నాలపేరుతో నా బతుకు బండలు చెయ్యకండి. ఒక బరువు తగ్గినా తగ్గినట్టే. మీ పాదాలకు మొక్కుతాను. నన్ను మీ కడుపులో పెట్టుకుని కాపాడండి అత్తగారూ—' అంటూ ఏడ్చిన ఆరోజు — ఈరోజు లక్ష్మి అయితే మరిచిపోయిందిగానీ తాను మరిచిపోగలడా?

అలాఏడ్చి, తమ గుండెలు కరిగించి, ఇంట్లో స్థానం సంపాయించి, ఈనాడు తన సాటిఆడది—అందునా స్వయాన ఆడబిడ్డ అయిన సరోజ వివాహం గురించి — ఎంత నిబ్బరంగా, కఠోరంగా మాట్లాడగలుగుతోంది లక్ష్మి!

'అరబ్బూ లొట్టిపిట్టా' పాఠం గుర్తుకొచ్చి, తనలోతను నవ్వుకున్నారు రాఘవయ్యగారు.

కాస్త జాగాఇమ్మని ముందడిగి, తర్వాత లోన పడుకున్న అరబ్ మహాశయుణ్ణి బయటకు నెట్టి, లోపల హాయిగా విశ్రమించిన ఒంటెకు, కొందరు మనుషులకు — ఏమిటి తేడా?

తాను, బడిపంతులుగా — జీతాలు లేకపోయినా, ఎప్పుడూ అతుకులుపడ్డ బట్టలే వేసుకున్నా, నానా ఇబ్బందులూపడి కడుపు కట్టుకుని, పైసాపైసా కూడదీసి, రామాన్ని బియ్యే చదివించాడు. అక్కణ్ణించి ఉద్యోగాల వేటలో హతాశుడై, డస్సిపోయి, నిరాశా నిస్పృహలు ముప్పిరిగొన్న తరుణంలో, పక్కవూళ్లో తన పాత విద్యార్థి ఒకడు బేంక్ ఏజంట్‌గా వున్నాడనే వార్త, తిరిగి తనలో ఆశాజ్యోతి వెలిగించింది. అతని దగ్గరకువెళ్లి ఉద్యోగబిక్ష పెట్టమన్ననాటి సంఘటన కళ్లముందు మెదిలింది.

'చూడండి రామేశంగారూ! మీరు చిన్నప్పుడు నా దగ్గర చదువుకున్నారు. ఈనాడు నేను చాలా బాధల్లోవున్నాను. నా కొడుక్కి ఏదేనా వుద్యోగం దొరికితే, నాకు వాడు కాస్త తోడుగా వుంటాడు. ఈ సహాయం మీరు చెయ్యాలి' అని తానన్నప్పుడు —

అంతపెద్ద ఉద్యోగీ, చిన్నప్పటి తన శిష్యుడిలా లేచి, తన రెండుచేతులూ పట్టుకుని—

'మాస్టారూ ... ఏమిటీ మాటలు మాస్టారూ...నన్ను 'మీరు' అని గౌరవిస్తున్నారా? మీరిలా అనడం నాకెంత బాధకలిగిస్తుందో ఎలా చెప్పను మీకు? క్రమశిక్షణ ఇచ్చి, సమవీక్షణతో మీరు మమ్మల్ని తీర్చిదిద్దారు. మీ ఆశీర్వాదం వల్లనే, నేనీనాడు ఈ స్థితిలో వున్నాను. కాకితో కబురుచేస్తే నేనే రానా మాష్టారూ? ఈపనికి మీరు స్వయంగా రావాలా? నాకు విద్యాబిక్షపెట్టి, నన్నింతవాణ్ని చేసిన మీరు ... మీరా ... ఇలా అడుగుతున్నారు. మాష్టారూ ... మీచెయ్యి ఎప్పుడూ పైనే వుండాలి మాష్టారూ! తప్పకుండా మీ అబ్బాయికి ఉద్యోగం ఇప్పించే ఏర్పాటు చేస్తాను. ఈ విధంగానైనా మీ ఋణం తీర్చుకుంటాను. చిన్నప్పుడు నేను పడ్డ బాధలు, భోజనం లేక ఉపవాసాలున్న రోజులు — అది తెలిసి మీ ఇంటనే నాకు భోజనాలు ఏర్పాటుచేసిన మీ ఉదార హృదయం ... మాష్టారూ ... ఎలా మరిచిపోను మాష్టారూ...ఆ రోజులు—' బాధ, దుఃఖం గొంతుకలో కొట్టుకోగా, మాట పెగిలిరాక, అటుతిరిగి, కళ్లుతుడుచుకున్న రామేశం లాంటి శిష్యులు ... 'ఇంకా ఈ జీవితానికి ఏం కావాలి? ఇంతకన్న ధన్యత్వమాత్రం ఏం వుంటుంది?—' మనసు ద్రవించగా అనుకున్నారు రాఘవయ్యగారు.

ఉద్యోగం దొరికి, పెళ్లై, వేరేవూళ్లో కాపురం పెట్టగానే, రామం—అన్నీ మరిచిపోయి, పెళ్లాం కొంగుపట్టుకుని అప్పుడే 'విరామం' అంటున్నాడు.

'విశ్రాంతి ఎరగనిదిరా జీవితమంటే! చనిపోయే ఆఖరి క్షణంవరకూ, మనిషనేవాడు బాధ్యతలు విస్మరించ కూడదు—' అనే తన సిద్ధాంతానికి విరుద్ధంగా, రామం, ఈనాడు ఇలా బాధ్యతలు తప్పించుకో చూడడం రంపపుకోతే అయింది రాఘవయ్యగారికి.

రోగిష్టిఅయి, పక్షవాతంతో మంచం మీద పడివున్న పార్వతి—, తన వివాహం ఈ వయసులో, తలిదండ్రులకు ఒక పెద్ద సమస్యగా తయారయిందే—అన్న బెంగతో కృశించిపోతున్న సరోజ—, తను కనీసం స్కూలుఫైనలైనా చదవగలడా — అని బెంబేలు పడుతున్న చిన్నకొడుకు రాజా—, రిటైరై, నెలకి ఏభయి రూపాయిలేనా ఆర్జనలేని తన పరిస్థితులూ...

వీటన్నింటినీ తాను పరిష్కరించగలడా? కుటుంబ పరిస్థితుల్ని పరిష్కరించలేని

తను బతికుండి ఏం ప్రయోజనం? తానే ఓ సమస్యగా తయారు కాకముందే, తనని తాను అంకితం చేసుకుంటే —

'— ఏమౌతుంది. మిగిలినవాళ్ల భవిష్యత్తు ఏమౌతుంది? వాళ్లందర్నీ అలా నడిసముద్రంలో వదిలిపోవడం భావ్యమా?—' అని ఆలోచించడం చాలా తెలివితక్కువ. ఆరోగ్యమూ, అర్జనాలేని తనవంటి వాడి చావువల్ల నష్టంకన్న, మంచే జరగవచ్చు. బాధ్యతతో కొడుకూ కోడలూ ప్రవర్తించవచ్చు.

'మానాన్న వున్నాడు. ఆయన చూసుకుంటాడు' అనుకునే కొడుకూ—

'అది మామగారి బాధ్యత. ఆయనే ఏదో తంటాలు పడతారు—' అనే కోడలూ— ఇహనలా అనలేరు. అనుకోలేరు. ఇష్టం లేకపోయినా, లోకం కోసమేనా— తల్లిని, చెల్లిని, తమ్ముణ్ణి—చూసుకుంటారు. నిజమైన బాధ్యత అంటే ఏమిటో అప్పుడు తెలిసొస్తుంది.

ఈ సమస్యా పరిష్కారానికి మార్గం ఒక్కటే— అది— తన చావు.

తను బతికుండకూడదు. ఈ పరిగెడుతున్న రైలు, ఈ చీకట్లను పూర్తిగా చీల్చకముందే, లోకంలోకి వెలుగు ప్రసరించకముందే, తనని తిరిగి వ్యామోహం, బతుకుమీద తీపి—కప్పివేయకముందే— తాను అనంతంలో కలిసిపోవాలి.

## నేను చచ్చిపోతేనే మంచిది!

ఏ ఆర్జనాలేని తన వునికి ఎవరికి ఏం ప్రయోజనం? తన మరణం ఎవరికి ఏం నష్టం?

వెర్రి ఆవేశం ముంచుకురాగా, లేచి నిలుచున్నారు రాఘవయ్యగారు.


కంపార్ట్‌మెంట్‌లో బ్లూలైట్ డిమ్‌గా వెలుగుతోంది.

బాధ్యతల బరువుతో, బరువుగా ముందుకు అడుగులువేసి, గేటువద్దకు వచ్చారు.

దైన్యంగా సరోజ కళ్లముందు నిలిచింది

'నాన్నా...అంతపని చెయ్యకండి నాన్నా... నా పెళ్లి మీ మరణానికి కారణం కాకూడదు. వద్దు నాన్నా వద్దు— ఈ నిజాన్ని నేను భరించలేను. నాకు పెళ్లి కాకపోతేనేం? మీకు సహాయకారిగా వుండేందుకు ఉద్యోగం చేస్తాను నాన్నా ... మీరీ పని చెయ్యకండి నాన్నా... నామాట వినండి నాన్నా...'

'నాన్నా ... నేనింకా పోర్త్‌ఫారమేనా పూర్తిచెయ్యలేదు. నా బ్రతుకేమౌతుంది చెప్పండి నాన్నా... మాకు అన్యాయం చెయ్యకండి నాన్నా ... అమ్మవుండి లేనట్టే ... మీరూ మమ్మల్ని వదిలివెళ్తారా నాన్నా...' రాజా వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.




కాళ్లూ — చేతులూ నాటు, మాటకూడా పడిపోయి, మంచంమీద — అయిదేళ్లయి జీవచ్ఛవంలా కాలం గడుపుతున్న, తన ముప్ఫై అయిదేళ్ల సహధర్మచారిణి — పార్వతిమాత్రం ఏమీ అనలేదు.

ఆమె కళ్లు జలజల వర్షిస్తున్నాయి. ముఖంలో ఏదో వ్యక్తం చెయ్యలేని భావం. మెడలోని మంగళసూత్రాలవేపే తదేకంగా చూస్తున్న కళ్లు.

'ఈ బాధలకి తోడు, నాకు వైధవ్యం అనే శిక్షకూడా విధిస్తారా? వద్దండి వద్దు...మీ చేతుల్లో ప్రాణాయినదిలే భాగ్యం ప్రసాదించండి. ఎలా గడపాల్సివుంటే అలా గడుస్తాయి రోజులు. మీరు మాత్రం ఈ ఘోరానికి పూనుకోవద్దు. నన్ను అన్యాయం చెయ్యకండి...' అని పార్వతమ్మ అనలేదు. గానీ ఆమె ముఖంలో భావాలను, భాషలోకి తర్జుమాచేస్తే, ఈ అర్థమే వస్తుంది.

ఏవీ, ఇవేవీ— కదిలించకపోయాయి — రాఘవయ్యగారి నిర్ణయాన్ని.

ఆ చిరువెలుగులో, జేబులో కలం కాగితంతీసి, ఏవో రెండుముక్కలు రాసి, జేబులో పెట్టుకుని, గట్టిగా కళ్లుమూసుకుని ముందు కురికారు ఆయన.

సరిగ్గా అదేసమయానికి అక్కడికివచ్చిన టికెట్ కలెక్టర్, ఈ ఘోరాన్ని చూసి, చైన్ లాగేడు.

'కీచ్'మంటూ రైలు ఆగింది. జనం బిలబిలమంటూ దిగారు, ఏమైందంటే— ఏమైందని!

టార్చిలైట్ల వెలుగులు, ముళ్లపొదల్లో చిక్కుకున్న రాఘవయ్యగారి శవం, ప్రయాణీకుల్ని విభ్రాంతుల్ని చేసింది.

చనిపోయిన వ్యక్తి వివరాలకోసం, జేబులన్నీ వెతగ్గా రాఘవయ్యగారి చిన్నడైరీ, దాంతోపాటు దాచిపెట్టుకున్న చిన్నకాగితం బయటపడ్డాయి. ఆ కాగితంలో వున్న ముక్కలు ఇవి—

'—బతికుండే బాధ్యతలు నిర్వర్తించలేను కాబట్టి చచ్చిపోవడం లేదునేను. నా చావు నా సమస్యలకి ఒక పరిష్కారం కావచ్చు. గానీ, పిల్లలు బాధ్యత కలిగి ప్రవర్తించాలంటే, ఒకొక్కప్పుడు, తల్లిదండ్రులు దూరం కావడంకూడా అవసరం. అందుకే నేను చచ్చిపోతున్నాను—' ●